# వర్షం కురిసిన రాత్రి

—చిన్నా

"అమ్మా" కేక వేసి కుప్పలా కూలి పోయాను. నా పొట్టలో కత్తి గ్రుచ్చుకొని ఉంది. ఉలిక్కిపడి లేచాను.

కల .... పీడ కల ........

గోడ గడియారం పండెండు గంటలు కొట్టింది మామూలుగా.

లేచి లైట్ వేశాను ....

నా గుండెలో ఒక విధమైన వణుకు మొదలైంది

శరీరమంతా వణక సాగింది....ఒళ్ళంతా చెమట ....

మంచినీళ్ళు త్రాగి సోఫాలో కూల బడ్డాను ....

గుండె నొప్పి కొంచెం తగ్గినట్టుఅయింది.

అప్రయత్నంగా మరో మంచంపై పడు కున్న నా శ్రీమతి వైపు చూశాను. హాయిగా నిద్రపోతోంది .... అదృష్టవంతురాలు .... నాకు భయం వేసింది........

చిన్నప్పుడు—

వీధిబడికి వెళ్ళేటప్పుడు నామాలపంతులకు భయపడేవాణ్ణి!

పెళ్ళయినప్పటినుంచి—

ఈ దెయ్యానికి (సారీ! ధర్మపత్నికి) భయపడ్తూనే ఉన్నాను! టేబిల్ పైఉన్న సిగరెట్ పాకెట్‌లోంచి ఒక సిగిరెట్‌తీసి వెలిగించాను. సిగిరెట్ కాలుతున్నది! కాలుతున్న, సిగిరెట్‌లా నాగుండె మండుతున్నది. సిగరెట్ పొగలా నా మెదడులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయ్! కిటికీ వద్దకు వెళ్ళాను. ఆకాశంవేపు చూశాను... ఆకాశం అంతా మేఘావృతమై న్యాయానికి వేయబోయే ముసుగులా నల్లగా ఉంది....

ఎక్కడో మెరుపు!

"వానవచ్చేట్టుంది" అనుకున్నాను.

ఇంతలో -

ఫెళ ఫెళ ఉరుములు ... ఛక్ ఛక్ మెరుపులు!

కిటికీ మూసేసి, మళ్ళీ సోఫాలో కూలబడ్డాను.

"ఢాం!"

ఎక్కడో పిడుగుబడింది.

నా గుండె వెయ్యిమైళ్ళ స్పీడుతోకొట్టుకోసాగింది.

వర్షం కుండపోతగా కురవసాగింది.

తలుపు దబ్ .... దబ్ .... దబ్ ... బాదిన చప్పుడు

గాలికి చప్పుడౌతుందేమోనని ఊరుకున్నాను. కాని, తలుపు చప్పుడుతోపాటు మాటలు వినిపించాయి.

"బాబుగోరూ! తలుపు తీయండి .... తలుపు తీయండి."

గబ గబా వెళ్ళి తలుపుతీశాను.

ఎదురుగా పాతికేళ్ళ స్త్రీమూర్తి .... ఆమె కట్టుకున్న చీరె ఆమె అవయవాల్ని పూర్తిగా దాచలేకపోతున్నది.

ఆమె చంకలో దాదాపు మూడేళ్ళ కుర్రవాడు.

కుర్రవాని ఒంటిపై ఒక్క నూలు పోగు కూడా లేదు.

పిచ్చిగా ఆమె కళ్ళలోకి చూస్తున్నాడు.

ఇద్దరూ బాగా తడిసి ఉన్నారు.

"ఢాం"

మళ్ళీ ఎక్కడో పిడుగు పడింది.

నా గుండె స్పీడు మళ్ళీ ఎక్కువైంది.

"అమ్మా" అని కేక వేసి, తన తల్లిని వాటేసుకున్నాడు ఆ కుర్రవాడు.

"బాబూ!" తల నిమిరింది.

ఐదు నిమిషాల్నుంచి అచేతనునిగా నిలబడ్డ నాలో చేతనత్వంప్రవేశించింది కాబోలు.

"లోపలికి రామ్మా!...." అన్నాను ఏమనాలో తోచక.

ఆమె భయపడ్తూ లోనికి అడుగు పెట్టింది.

పిచ్చిగా దిక్కులు చూసింది. నడిరోడ్డుపై నిలబడి దారులు వెదికే వాడిలా.

"బయటికి వెళ్ళు ...." సింహ గర్జన విన్పించింది....

వెను దిరిగి చూశాను.

నా శ్రీమతి లేచి, నిలబడి ఉంది.

ఆమె కళ్ళలోంచి నిప్పులు రాల్తున్నాయ్.

ముఖం కోపంలో ఎర్రబడి ఉంది.

"నీకే చెప్పేది! బయటికి వెళ్ళు...."

"అమ్మగోరూ!.... ఈ ఒక్కరాత్రికి ఉండనీయమ్మా! నాకోసం కాదమ్మా!... బాబుకోసం వానకు వణుకుతున్నాడమ్మా!.... నీ కాళ్ళు పట్టుకుంటానమ్మా! చచ్చి నీ కడుపున పుడతా ..." ఆమె కళ్ళలోంచి కన్నీళ్లు ఏక ధారగా వస్తున్నాయ్.

"బయటికి వెళ్తావా? లేదా? నువ్వేం చేసు వెళ్తావే! ఊం .... ఊం ...."

"అమ్మగోరూ! తమరు ఈ రేత్రి మీ ఇంట్లో ఉండనీయక పోయినా ఫరవాలేదమ్మా? నన్నలా అనొద్దు. చావనైనా చస్తాం గాని...ని మాటలు వినలేను. నీ కొక్క దణ్ణం తల్లీ!..." అని బాబుతో సహా జోరుగా కురుస్తున్న వర్షంలోకి పరుగెత్తింది. దూసుకుపోయే రాకెట్‌లా ...

ఆమె వెళ్ళిన వేపు చూస్తూ నిలబడ్డాను.

"ఏమిటీ!!! మీరు బెల్లంకొట్టిన రాయిలా నిలబడి చూస్తున్నారు?. దానికి మీకు ఎన్నాళ్ళనుంచి సాగుతోంది. ఏమిటలా చూస్తున్నారు?... మీ రహస్యం బైట పడిందనా?... ఐనా మిమ్మల్నేననాలి?.... మిమ్మల్ని నాకంటగట్టిన మా నాన్నగారిననాలి!.... అయ్యోరామ!...." ముసలి కన్నీరు కార్తుస్తూ.... సోఫాలో కూలబడింది. నేను ఓదార్చాలనేమో, మధ్య మధ్య తలెత్తి నా వంక చూస్తోంది. ఐనా నేను నా శ్రీమతి వద్దకు వెళ్ళలేదు.

నాకళ్ళలో ఇంకా ఐదు నిమిషాల క్రితం జరిగిన సంఘటన.... స్త్రీ.... కుర్రవాడు .... మెదులుతున్నారు.

నిలవటానికి నీడలేని .. తింటానికి తిండిలేని.... నిరుపేదలు మనదేశంలోకోకొల్లలు.

గాంధి, నెహ్రూలు ఆశించిన రామరాజ్యంగా మనదేశం ఎన్నడు రూపొందుతుంది?... ఈ వానలో ఆస్త్రీని అలా వెళ్ళ

(మిగతా 39వ పేజీలో)

పంచబాణరస
ప్రసిద్ధిచెందిన ఔషధయోగము
నరముల బలహీనత,
గుండె బలహీనము,
శుక్లనష్టము, హరించి
వీర్యవృద్ధిని కలిగించును.
40 బిళ్ళలు Rs. 25-50
పోస్టేజి అదనము.
MAN PHARMA
P. B. No. 353
VIJAYAWADA - 2.

# వర్షం కురిసిన రాత్రి

(4 వ పేజీ తరువాయి)

గొట్టినందుకు నా మనసెందుకో ఆక్రోశించింది.

కాని.... నేను అశక్తుణ్ణి....బలహీనుణ్ణి.... ధనహీనుణ్ణి .... ఈ యింటిలోని ప్రతి వస్తువు....అణువు....

మా ఆవిడనొస్తే....

ఆలోచనలతో నాలుక పేడెక్కసాగింది.

నా గుండెలో రెళ్ళు పరుగెత్తసాగాయి.

శరీరం స్వాధీనం తప్పిపోసాగింది.

మా శ్రీమతి యింకా వాగుతూనేఉంది.

మెల్లగా అడుగులో అడుగువేస్తూ, మంచందగ్గరికి వెళ్ళి దానిలో కూలబడ్డాను.

ఇంకా వర్షం కురుస్తూనే ఉంది.

ఉరుములు! మెరుపులు!

నా గుండెల్లో మంటలు! మంటలు!

• • •

తెల్లవారింది.

బాలభానుని బంగారు కిరణాలు జగమంతా పరుచుకుంటున్నాయ్.

పనికుర్రవాడు రాములు నా కాఫీ అందిస్తూ....

"బాబుగారూ! మన వీధిచివరిచెట్టుక్రింద ఉండే బిచ్చగత్తె కొడుకు చచ్చిపోయాడండి.... పాపం! రాత్రి వానకు తడిసినట్టున్నాడు .... ఏమిటాలోచిస్తున్నారు బాబుగారూ! కాఫీత్రాగండి! ప్రొద్దున్నే చావు కబురు చల్లగా చెప్పారు,... ఏమిటో! నా నోరు మంచిదికాదండి!...." అన్నాడు.

నా కెందుకో కాఫీ త్రాగాలన్పించలేదు.

"రాములూ! ఆ చెట్టు దగ్గరికి పోదాం పద." అన్నాను ఏదో ఆలోచిస్తూ.

రాములు నా వంక అయోమయంగా చూశాడు ఏమి అర్థంకానట్టు. రాములు సహాయంతో చెట్టు దగ్గరికి వెళ్ళాను.

నా నెత్తి మీద పిడుగుపడ్డట్టయింది.

భగవాన్! రాత్రి మా యింటికి వచ్చిన స్త్రీమూర్తి కొడుకు చచ్చిపోయాడు!

నా శ్రీమతి ఆమెను వెళ్ళగొట్టకపోతే, కుర్రవాడు బ్రతికి వుండేవాడేమో!

ఆమె తనకొడుకు శవంపైపడి ఏడుస్తూనే వుంది.

ఆమె కళ్ళలోంచి కన్నీళ్ళు కుండపోతగా వస్తున్నాయ్.

ఆ దృశ్యం చూడలేకపోయాను.

అప్రయత్నంగా నా చేయి జేబులోకి వెళ్ళింది. రెండు రూపాయల నోటు తీసి ....ఆమె కివ్వమని రాములు కిచ్చాను. ఎన్నికల్లోఓడిపోయిన రాజకీయనాయకునిలా తలొంచుకొని బరువైన గుండెలతో మా యింటివేపు అడుగు వేశాను. ★

---

పొందిక అయిన భాష వుండాలి. నువ్వు తీసుకున్న కథ ముందు నీ మనస్సులో నిలిచిపోవాలి. అప్పుడు రాయటానికి ప్రయత్నించాలి. మొదలు పెట్టి ఆలోచించుకుంటూ రాయటం ప్రారంభిస్తే. నువ్వు చెప్పదలచుకున్నది ఒకటి, నువ్వు రాసేది మరొకటి అవుతోంది. అలా రాయటం బాగా రాయగలిగిన వాళ్ళకు మాత్రమే సాధ్యం. అందువల్లనే నీ రచనలు తిరిగి వస్తున్నాయి. సస్పెన్సు వుండాలి. నువ్వు ముందే కథ ముగింపు తెలిసే విధంగా రాస్తున్నావు. ఈ రచన నేను తీసుకెళతాను. దిద్ది నీ పేరుతో పంపుతాను. సరేనా! ఏరా శేఖర్?" అన్నాడు రాజారావు.

"నువ్వలా అంటే, నేను కాదంటానా? కనీసం పోస్టు ఖర్చులన్నా మిగులుతాయి. ఆ డబ్బుతో, ఆదివారం పిక్చర్ కెళ్ళవచ్చు."

ఆయన మాటలకేంగాని, మీకలా చేయాలని వుంటే, అలా చేయండి. మీరు ఎలా చేసినా, కథ నా పేరుతో అచ్చవ్వాలి."

సెలవు తీసుకు వెళ్ళిపోయాడు రాజారావు.

నెల రోజులు గడిచాయి. ఒకరోజు ఆఫీసు నుంచి వస్తూ. పత్రిక చేత్తో పట్టుకుని హుషారుగా వచ్చాడు శేఖర్. లలితా! నీ కథ అచ్చయింది. నువ్వూ రచయిత్రి వయ్యావు. చూడు అచ్చులో నీ పేరు ఎంత అందంగా వుందో, పత్రిక లలిత కందించాడు.

"నిజంగానా అండీ, అబ్బ నా పేరు అచ్చయింది. నేనూ రచయిత్రి నయ్యాను. మీరెప్పుడూ ఎగతాళి చేస్తారుగా, ఇప్పుడేమంటారు? అరె మర్చిపోయాను. వదినగారికీ, బామ్మగారికీ చూపించాలి. పరుగెత్తుకుంటూ పత్రిక తీసుకుని వెళ్ళిపోయింది.

అందులోని కథ పేరు, పాత్రల పేరు, మాత్రమే లలిత రాసినవనీ, మిగతా అంతా రాజారావు రాశాడనీ, ఆమె కోర్కె తీర్చడానికి ఆమె పేరుపెట్టి పంపించాడనీ, ఆ సంతోషంలో తెలుసుకోలేక పోయింది. అచ్చులో తనపేరు చూసుకుని, ఆ సంతోషాన్ని నలుగురికీ పంచాలని వెళ్ళిన లలిత అమాయకత్వాన్ని చూసి ఇప్పటి కయినా ఆమె కోర్కె తీరిందని తృప్తిగా నవ్వుకున్నాడు శేఖర్. ★

---

# వైద్య సలహాలు

—డా॥ జొన్నలగడ్డ వీరాస్వామి.

ప్రశ్న॥ సి. లక్ష్మీరావ్, హౌరా: నాకు 7 సం॥ నుండి దగ్గు, ఆయాసం. మందులు తాత్కాలికంగా పని చేస్తున్నవి. అన్నం అరగదు. కాళ్ళు, చేతులు నొప్పులు.

జ॥ మీ జబ్బును (ఆస్త్మా) ఉబ్బసం అంటారు. ఇది ఎలర్జీకి సంబంధించింది. మీకు ఎలర్జీ గలిగే ఆహారం వల్ల వస్తే ఆ ఆహారాన్ని మానండి.

ఈ జబ్బుకు సరియైన చికిత్స లేదు. తాత్కాలికంగా తగ్గించవచ్చు.

ఉబ్బసంలో, ఉదరంలో ఉండవలసిన ఆమ్లం ఉండదు. లోపిస్తుంది. వైద్యునితో సంప్రదించి కొన్ని చుక్కల ఆమ్లాన్ని నీళ్లలో కలిపి కొంత కాలం తీసుకోండి ఆకలి పుడుతుంది.

ఇప్పుడు "కార్టిసోన్" ఉబ్బసానికి వాడుతున్నారు. ప్రయత్నించండి.

ప్ర॥ పి. వెంకటేశ్వర్లు, కంచికచర్ల: నాకు 10 సం॥ క్రింద గుండెల్లో ఎడమ వైపున నొప్పి వచ్చింది. ఎడమ చేయి నొప్పి, బలహీనం. పరీక్ష లోపం లేదని చెప్పారు.

జ॥ మీ వయస్సు, 28 సం॥ లే. అప్పుడే గుండె పోటు గురించి ఆలోచించటం సమంజసం కాదు. ఇది 40 సం॥ దాటాక సాధారణంగా వచ్చే జబ్బు.

"పిరికివాడు ఎప్పుడూ చస్తుంటాడు, ధైర్యవంతుడు ఒక్కసారి చస్తాడు. అనేది చాల గొప్ప సూక్తి. దాన్ని గురించి మీరు ఎప్పుడూ ఆలోచిస్తుంటే, అలాగ నొప్పి వస్తూంటుంది.

"మీ అనుమానం, నివారణ కావాలంటే "గుండె జబ్బుల నిపుణులు. గుంటూరు. వైజాగ్ ఆస్పత్రుల్లో ఉన్నారు. వారితో సంప్రదించండి.

[సశేషం]